క్లుప్తంగా

ఆదిత్యలో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో కళాశాల ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు రచించిన పుస్తకాన్ని మంగళవారం కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అధ్యాపకులు ఎం.పాపినాయుడు, వి.రాంబాబు, ఎం.కృష్ణప్రసాద్, ఎస్.శైలజ తదితరులు 'ఎ డబుల్ విజన్ ఇన్ జంపా లహరిస్ వర్క్స్' అనే అంశంపై పుస్తకాన్ని రచించారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు అక్కడ పరిస్థితులు, జాతి వివక్షత తదితర అంశాలకు సంబంధించి పుస్తకంలో పేర్కొన్నట్లు కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఇండియన్ డయాస్పొరిక్ విభాగంలో పీహెచ్‌డీ చేసే స్కాలర్లకు, బీఏ ఆంగ్ల సాహిత్యం చదివే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ కె.వేణుగోపాల్, బీఎస్‌అండ్‌హెచ్ హెచ్‌ఓడీలు ఎం.రమణయ్య, ఎం.వి.రత్నమణి ఉన్నారు.

వితంతువులకు పింఛన్ అందించాలి



అవగాహన కల్పిస్తున్న జడ్జి తేజ చక్రవర్తి మల్ల

టెక్కలి: అర్హులైన వితంతువులకు కచ్చితంగా పింఛన్ అందజేయాల్సిందేనని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల స్పష్టం చేశారు. వితంతు పింఛన్ పథకంపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వితంతువులు ఏ విధంగా పింఛన్ కోసం దరఖాస్తు చేయాలో అనే దానిపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, సూపరింటెండెంట్ హెచ్.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

పలాసపురంలో జ్వర పరీక్షలు



జ్వర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సోంపేట: జ్వరాల నియంత్రణకు రోగులు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని పలాసపురం గ్రామంలో సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యంలో ఇంటింటా జ్వర పరీక్షలు మంగళవారం వైద్యసిబ్బంది చేపట్టారు. గోరు వెచ్చని నీరు తాగాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది హేమంత్, భారతి, విద్యావతి పాల్గొన్నారు.

చిన్నారికి రూ. 1.15 లక్షల సాయం



చిన్నారి కుటుంబానికి సాయం అందిస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య, ధనలక్ష్మిల రెండున్నరేళ్ల కుమారుడు రుషికేశ్‌కు బ్లడ్ క్యాన్సర్ సోకింది. వైద్యానికి రూ. 25 లక్షల వరకు ఖర్చవుతోందని వైద్యులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఉద్దానానికి చెందిన ఎస్‌జీఎఫ్ సంస్థ తమవంతు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చింది. చిన్నారిని సంస్థ ప్రతినిధులు మంగళవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.15 లక్షలు సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. వైద్యం కోసం విరాళాలు సేకరించడంలో ఎస్‌జీఎఫ్ మహిళ విభాగం ముఖ్యసభ్యులు మల్లీశ్వరి, ఆమె స్నేహితులు కీలకపాత్ర వహించారని సంస్థ సభ్యులు తెలిపారు.

స్వదేశీ మత్స్య పారిశ్రామిక సంఘాల బలోపేతం



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇచ్ఛాపురం: స్వదేశీ మత్స్య పారిశ్రామిక సంఘాలను బలోపేతం చేస్తామని మత్స్యశాఖ సహాయ సంచాలకులు వై.సత్యనారాయణ అన్నారు. స్వదేశీ మత్స్యకారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి సంఘాలతో చేకూరే ప్రయోజనాలను వివరించారు. కృషివిజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణరాజు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్ చేప పిల్లల పెంపకానికి అనువైనదన్నారు. చేపల పిల్లలను చెరువులో విడిచిపెట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నివాళి



ప్రజా విప్లవ గాయకుడు గద్దర్ ఆశయ సాధనకు కృషిచేద్దామని జైభీమ్ సేన వ్యవస్థాపకులు డాక్టర్ నగిరి మోహనరావు అన్నారు. సోంపేటలోని జైభీమ్ సేన కార్యాలయంలో గద్దర్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజా సమస్యలు, పీడిత శ్రామిక వర్గాల కోసం నిత్యం చైతన్యంతో ప్రభుత్వాలపై పోరాటం చేసిన యోధుడు గద్దర్ వక్తలు అన్నారు. జైభీమ్ సేన జిల్లా అధ్యక్షులు బుష్కా ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దొప్ప వెంకటరావు, కార్యదర్శి పూర్ణ చంద్రుడు, సభ్యులు పాల్గొన్నారు. -సోంపేట

పంపిణీ



బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్సులను మంగళవారం పంపిణీ చేశారు. ఉత్తమ ఫలితాలను సాధించేందుకు నిరంతరం క్రమశిక్షణతో చదువును కొనసాగించాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాజేశ్వరరావు, నాయకులు బెందాళం రమేష్, ఆరంగి మధు, బెందాళం కామరాజు, బి.తిరుమలరావు, కోళ్ల ముకుంద, వజ్జ రంగారావు, గొరకల రామారావు, సిబ్బంది విష్ణుమూర్తి, పి.హరి, బొడ్డ శ్రీనుబాబు, జి.పాపారావు, కరుణశ్రీ,అనసూయమ్మ, ఉగాదినాయుడు పాల్గొన్నారు. -కవిటి

శ్రమదానం



వజ్రపుకొత్తూరు మండలంలోని పల్లిసారధి గ్రామంలోని అసిరి పోలమ్మ ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం శ్రమదాన కార్యక్రమం చేపట్టి ఆదర్శంగా నిలిచారు. పల్లిసారధి, దోకులపాడు రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. వీరిని స్థానికులు అభినందించారు. ఆటో యూనియన్ అధ్యక్షులు తామాడ సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులు సాన కృష్ణారావు, పోతనపల్లి కొదండరావు, లక్ష్మీపతి, రెయ్యి హేమంత్, మధు ఉన్నారు. -వజ్రపుకొత్తూరు రూరల్

చిన్నారులు భద్రమేనా?

- పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు ఆటోలే దిక్కు
- హైవేపై భయంతో ప్రయాణం

వజ్రపుకొత్తూరు రూరల్: పాఠశాలలు ఇటీవల తెరుకున్నాయి. పిల్లలు బడిబాట పడుతున్నారు. అయితే ఈ తరుణంలో చిన్నారులు బడికి వెళ్లాలంటే ఆటోలే ఆధారం. గ్రామీణ ప్రాంతాలకు ప్రైవేట్ పాఠశాలల బస్సులు రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ఎక్కువ మంది పిల్లలు బడులకు ఆటోలపై కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తుంది. ప్రధానంగా కాశీబుగ్గ, పలాస పట్టణాలలో కార్పొరేట్ పాఠశాలతో పాటు మరికొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇక్కడకు మారుమూల ప్రాంతాల నుంచి చిన్నారులు బడికి చేరుకోవాలంటే జాతీయ రహదారి మీదగా ఆటోల్లోనే వెళ్లాల్సి ఉంది. అలాగే నగరంపల్లి, వజ్రపుకొత్తూరు, బెండి, ధర్మపురం తదితర ప్రాంతాల్లో గల ప్రభుత్వ బడులకు వెళ్తున్న చిన్నారులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

ప్రత్యామ్నాయ మార్గం కరువు

కార్పొరేట్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చిన్నారులు వెళ్లాలంటే ఆటోలే ఆధారం అవుతున్నాయి. మారుమూల ప్రాంతాలకు అరకొరగా



నగరంపల్లి వద్ద ఆటోలో కిక్కిరిసి ఎక్కుతున్న చిన్నారులు

ఆర్టీసీ బస్సులు ఉండటంతో పాటు సమయపాలన లేకపోవడంతో తప్పని పరిస్థితిలో పిల్లలను ప్రైవేట్ వాహనాల్లోనే పాఠశాలలకు తల్లిదండ్రులు పంపిస్తున్నారు. అలాగే కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ బడులకు చెందిన బస్ ఫీజులు సైతం అధికంగా ఉండటంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆర్థిక భారం మోయలేక తప్పనిసరి పరిస్థితిలో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీనిని అసరాగా చేసుకొని ఆటో యజమానులు అత్యాశతో పరిమితికి మించి పిల్లలను ఆటోల్లో ఎక్కించుకుంటూ హైవేపై అధిక వేగంతో ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఎలాంటి ప్రమాదం సంభవిస్తోందోనని పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యాయి. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. తాజాగా ఇచ్ఛాపురం మండలం సమీపంలో



హైవేపై ఆటోలో పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు

సుమంది గ్రామం వద్ద ఈనెల ఐదో తేదీన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తాపడింది. అలాగే నందిగాం, బాణాపురం, బెండిగేట్, తురకలకోట, రెట్టికోట, గరుడబద్ర తదితర ప్రాంతాల్లో గతంలో ప్రమాదాలు జరిగాయి. అయినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల్లేక ప్రమాదకర పరిస్థితిలో చిన్నారులను వారి తల్లిదండ్రులు బడులకు పంపిస్తున్నారు.

> **వాహనాలపై చర్యలు తీసుకుంటాం**
>
> పరిమితికి మించి చిన్నారులను తరలిస్తున్న ఆటో యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారులపై ప్రయాణం చేసే ఆటోలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రధానంగా ప్రైవేట్ వాహనాలలో పిల్లలను పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఆటో యజమానులకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. పాఠశాలల వాహనాల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాం.
>
> పి.ఈశ్వరరావు, కాశీబుగ్గ రూరల్ సీఐ

బ్రహ్మాస్త్రంతో సత్ఫలితాలు

కంచిలి: కూరగాయల పంటలను ఆశిస్తున్న పెద్ద పురుగుల నివారణ కోసం సేంద్రీయ పద్ధతిలో.. ఎటువంటి ఖర్చులేకుండా తయారు చేసే బ్రహ్మాస్త్రంతో చక్కని ప్రయోజనం ఉంటుందని మండల యాంకర్ టి.శివానందం పేర్కొన్నారు. మండలంలోని అంపురం యూనిట్ పరిధిలో గల బలియాపుట్టుగ గ్రామంలో కల్లా దొంబురు సాగు చేస్తున్న దొండ, బీర కూరగాయల పంటలకు ఆశించిన పెద్ద పురుగుల నివారణకు అవసరమైమైన బ్రహ్మాస్త్రం తయారీని పొలం వద్ద రైతులకు మంగళవారం వివరించారు. దీన్ని పంటపై సాయంత్రం పూట ఒక స్ప్రే ట్యాంక్ నీటిలో అర లీటరు బ్రహ్మాస్త్రం కలిపి పంటపై స్ప్రే చేయాలని



బ్రహ్మాస్త్రం తయారీని చూపిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సూచించారు. దీని తయారీ విధానాన్ని కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఐసీఆర్‌పీ బి.పుష్ప, లీడ్ ఫార్మర్ కృష్ణారావు ఉన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

పలాస: ఉద్దాన ప్రజల జీవనాధారమైన జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా 80 కేజీల బస్తా రూ.16 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను తన కార్యాలయంలో జీడి రైతు సంఘ నాయకులు మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో జీడి పంటపై ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని అన్నారు. అలాగే పలాస కేంద్రంగా జీడి బోర్డును ఏర్పాటు చేయాలని, బ్యాంకుల ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జీడి రైతాంగానికి అమలు చేయాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

కార్యక్రమంలో సంఘ నాయకులు కుత్తుం వినోద్ కుమార్, తమ్మినాన భాస్కర్, మడ్డు రాఘవరావు, సూరాడ మోహన్‌రావు, అంబటి రామకృష్ణ, బత్తిని లక్ష్మీనారాయణ, దాసరి తాతారావు ఉన్నారు.

వైభవంగా మంగళగౌరీ వ్రతాలు

కవిటి: మండలంలోని లొళ్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వర ఆలయం, ప్రగడపుట్టుగలోని శివాలయంతో పాటు పలు ఆలయాల్లో శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా సామూహిక మంగళగౌరీ వ్రతాలు వైభవంగా జరిగాయి. మహిళలు తమకు మాంగల్యబలాన్ని ఇవ్వాలని మంగళ గౌరీదేవికి వ్రతాలు చేయడం ఆచారం. ఇందులో భాగంగా లలితా సహస్రనామసహిత కుంకుమార్చన, మంగళగౌరీ వ్రతకథతో వ్రతాన్ని పూర్తిచేశారు. లొళ్లపుట్టుగలో ప్రధానార్చకులు అప్పలస్వామి, వెంకటరమణస్వామిల పర్యవేక్షణలో భారీసంఖ్యలో మహిళలు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. అలాగే కవిటిలోని చింతామణి అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.



లొళ్లపుట్టుగలో మంగళగౌరీ వ్రతాలు చేస్తున్న మహిళలు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం క్షీణించకుండా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేయాలన్నారు. మండలానికి ఉపాధిహామీ పథకం ద్వారా వివిధ పనులు చేపట్టేందుకు రూ. 6.50 కోట్లు మంజూరైనట్టు వెల్లడించారు. సీసీ రోడ్డుల, కాలువల



మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

నిర్మాణాల కోసం పంచాయతీ తీర్మాణాలను మండల పరిషత్ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఎంపీడీవో రామారావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరులు, పంచాయతీరాజ్ జేఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కమల వికాష్, ఏపీవో ప్రమీల, సర్పంచ్‌లు తడక జోగారావు, ఎస్.హరీష్, టి.పద్మావతి, బి.మాధవరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషను కలిసిన వైద్య బృందం

- కిడ్నీ పరిశోధన కేంద్రంపై చర్చ

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను తన కార్యాలయంలో కిడ్నీ పరిశోధన కేంద్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైద్య బృందం సభ్యులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం డయాలసిస్ సెంటర్‌గా పనిచేస్తుందా.. పరిశోధన కేంద్రంగా పనిచేస్తుందా అని అధికారుల నుంచి ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దీని నిర్మాణానికి రూ.53 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. రూ.25 కోట్ల విలువైన అధునాతన సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా రూ.14 కోట్ల ఎక్విప్‌మెంట్ మాత్రమే గత ప్రభుత్వం అందించిందని వివరించారు. పూర్తిస్థాయిలో కిడ్నీ పరిశోధన కేంద్రానికి కావలసిన ఎక్విప్‌మెంట్ అక్కడ లేదన్నారు. 2014–19 వరకు ఉన్న కూటమి ప్రభుత్వానికి



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని సిఫారసు చేశారని.. అందుకు అప్పటి సీఎం చంద్రబాబు స్పందించి నిర్మాణం చేపట్టేందుకు భూ సమీకరణ చేపట్టి శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్యప్రభాకర్, డీఈఈ త్రిమూర్తాలు, జేఈలు నరేంద్ర, ధనుంజయ, సాయిసురేంద్ర, బీఎంఈ దామోదరరావు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కంకరగుమ్మి చెరువు ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పలస్వామిని మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. చెరువులో ఆక్రమణలు జరుగుతున్నాయని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టడంతో పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాంబుడ్డి గణపతి, తామాడ



తహసీల్దార్‌ను అభినందిస్తున్న కొర్లాం గ్రామస్తులు

వాసుదేవ్, రత్నాల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

సోంపేట: ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవాలని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ పాల్గొన్నారు.

సొండి కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

టెక్కలి: నూతన అబ్కారీ విధానంలో సొండి కులస్తులకు ప్రాధాన్యతనివ్వాలని సొండి కుల సంక్షేమ సంఘం సభ్యులు ఎస్.కమలకరరావు, ఎం.త్యాగరాజు, ఎస్.యల్లారావు, జి.నాగభూషణం కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్త మద్యం దుకాణాల పాలసీ విధానంలో భాగంగా గౌడ, శెట్టిబలిజ, ఈడిగ సామాజిక వర్గాలకు 15 నుంచి 20 శాతం వరకు రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారని వారు గుర్తు చేశారు. ఈ క్రమంలో సారాయి కాపు కాసే వృత్తిని కుల వృత్తిగా చేసుకున్న సొండి కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణలు తొలగించండి

టెక్కలి రూరల్: టెక్కలిలోని పట్టు మహాదేవి కోనేరు గట్టుపై ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి అన్నారు. ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ సిబ్బంది జేసీబీతో మంగళవారం చెరువు గట్టుకు చెరుకున్నారు. దీంతో వ్యాపారులు అధికారులను కలిశారు. కొద్దిగా సమయం ఇస్తే స్వచ్ఛందంగా గట్టుపై ఉన్న దుకాణాలను ఖాళీ చేస్తామని విజ్ఞప్తి చేశారు. దీంతో ఒకరోజు సమయం ఇచ్చారు.

ఇంటర్మీడియెట్ కీలకం

ఇచ్ఛాపురం: విద్యార్థి భవిష్యత్‌కి ఇంటర్మీడియెట్ విద్య వారధి వంటిందని ఇచ్ఛాపురం సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ బి.శంకరరావు అధ్యక్షతన మంగళవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్‌కి బాటలు వేసుకొని.. వాటిని సాధించేందుకు అహర్నిశలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పట్టణ ఎస్ఐ వి.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల కరపత్రం ఆవిష్కరణ

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో అమరవీరుల స్మారక భవనం వద్ద ఆదివాసీ హక్కుల కరపత్రం ఆవిష్కరణ మంగళవారం జరిగింది. హైదరాబాద్‌లో ఈనెల 9, 10వ తేదీలలో జరుగనున్న ఆదివాసీ హక్కుల పోరాట సంరక్షణ వేదిక సదస్సులను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్ర ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం ప్రజా కళామండలి, అమరుల బంధు మిత్రుల సంఘం, పీడీఎస్ విద్యార్థి సంఘం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రతినిధులు, ప్రజాస్వామికవాదులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శాసనమండలి ఛైర్మన్‌కు సత్కారం



నందిగాం: మోషేన్‌రాజును సత్కరిస్తున్న తిలక్ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: మోషేన్‌రాజ్‌ను కలుసుకున్న ఇచ్ఛాపురం నాయకులు

నందిగాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కొయ్య మోషేన్‌రాజును నందిగాంలో వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మంగళవారం సత్కరించారు. ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వెళ్తూ మధ్యలో నందిగాంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనను నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి తిలక్ దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జడ్యాడ జయరాం, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, తమిరె రాజు, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, కురమాన ఉత్తం కుమార్, కణితి వెంకట్ ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: శాసన మండలి ఛైర్మన్‌మోషేన్‌రాజును మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ నర్తు రామరావు స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా స్థానిక జాతీయ రహదారిపై ఆయన్ని కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాదరావు, నీలాపు సారధిరెడ్డి, దుక్క ధనలక్ష్మి, నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, ఇసురు తులసిరాం, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ సర్పంచ్ నీలాపు చంద్రయ్య, నర్తు గణపతిలు ఉన్నారు.

'సహారా బాధితులను ఆదుకోవాలి'

కాశీబుగ్గ: సహారా ఖాతాదారులకు డబ్బులు చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని సహారా బాధితులు, ఏజెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బైపల్లి సత్యరాజు అన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసి ఖాతాదారులను ఆదుకోవాలని కోరారు. డబ్బులను చెల్లించకపోతే స్వచ్ఛంద మరణాలు చేసుకుంటామని హెచ్చరించారు. కాశీబుగ్గ సహారా కార్యాలయం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 12 ఏళ్లుగా సహారా సంస్థ చేసిన దారుణానికి సామాన్యులైన ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏజెంట్లుగా తాము గ్రామాల్లో తిరగలేకపోతున్నామని, కట్టిన డబ్బులు ఇవ్వాలని ఖాతాదారులు తమ ఇళ్ల వద్దకు వచ్చి ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి సహారా ఖాతాదారులకు న్యాయం చేయకపోతే ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు చింతాడ మాధవరావు, కాశీ విశ్వనాథం, ధనరాజ్ ఉన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు